క్లుప్తంగా

నిఘా మరింత పటిష్టం



రాజాంలోని ఓ కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: నేరాల నియంత్రణకు నిఘా మరింత పటిష్టం చేశామని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగానే పట్టణంలో 11 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఆదివారం ఆయన తెలిపారు. ప్రధాన కూడళ్లు, బ్లాక్ స్పాట్స్ తదితర ప్రాంతాల్లో నేరాలు, ప్రమాదాలకు పాల్పడిన వారిని గుర్తించడంలె సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

సైకిల్ షెడ్ ప్రారంభం



సైకిల్ షెడ్‌ను ప్రారంభిస్తున్న విశ్రాంత హెచ్‌ఎం సరస్వతి

సంతకవిటి: మండలంలోని గుళ్ల సీతారాంపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు నిర్మించిన సైకిల్ షెడ్‌ను విశ్రాంత హెచ్‌ఎం కోన సరస్వతి ఆదివారం ప్రారంభించారు. ఆ పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు రూ.2.50 లక్షలు వెచ్చించి సైకిల్ షెడ్‌ను నిర్మించారు. షెడ్ ప్రారంభోత్సవంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

బాడంగి: మండలంలోని పూడివలసలో సర్పంచ్ రెడ్డి తిరుపతినాయుడు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు రోజున వేదపండితులు యడవల్లి శ్రీనివాసశర్మ నేతృత్వంలో రుత్వికులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనం తరం గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.

సీనియర్ వైద్యుడికి సత్కారం



డాక్టర్ సూర్యప్రకాష్‌ను సత్కరిస్తున్న జె.సి.రాజు, డేవిడ్ విక్టర్

బొబ్బిలి: పట్టణంలో చదువుకుని విశాఖలోని కేర్ ఆస్పత్రిలో గుండె వైద్య నిపుణులుగా పనిచేస్తూ ఈ ప్రాంత రోగులకు అందుబాటులో ఉంటున్న డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్‌ను స్థానిక కారుణ్య ఫౌండేషన్ సీఈఓ జె.సి.రాజు, సీఓ డేవిడ్ జె.విక్టర్‌లు ఆదివారం ఘనంగా సత్కరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రసార భారతి మంత్రిత్వ శాఖ, విజనరీ ఇండియన్స్ అవార్డ్స్ గుర్తించిన గోల్డెన్ స్పేరోస్ సంస్థ ఇటీవల డాక్టర్ సూర్యప్రకాష్‌కు ఢిల్లీలో రియల్ లైఫ్ హీరోస్ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన్నికారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవంగా సత్కరించి, పేద, మధ్యతరగతి ప్రజలకు మరిన్ని వైద్య సేవలందించి పేరొందాలని అభిలషించారు.

అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు పెంకి శివాని, కొరికాన అనూష నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)నకు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.అప్పలస్వామి తెలిపారు. పాఠశాలలో ఈవిద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల కోసం ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఈ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరచారని చెప్పారు.

ఉపాధ్యాయులు జి.సూరప్పలనాయుడు, పక్కి వాసు, డోల వాసు, కె.బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరటికి భలే గిరాకీ

- ఒక్కసారిగా పెరిగిన ధర
- పండ్ల గెల ధర రూ.500పై మాటే
- కూరకు వినియోగించే కాయ అరటిది కూడా అదే దారి
- ధర ఉన్నప్పటికీ అందులో రైతుకు దక్కుతున్నది సగమే
- మిగతా సగం దళారులు, వ్యాపారులదే



రాజాం సంతలో అరటిపండ్ల గెలలు విక్రయాలు (ఫైల్)

రాజాం:

వివాహాలు, శుభ కార్యాలు, సంబరాలు, యాత్రలు, గ్రామదేవతల పండగలు అన్నీ ఒకేసారి జరుగుతుండడంతో ఈ వేసవిలో అరటి పండ్లకు గిరాకీ పెరిగింది. అరటి ధర అధికంగా ఉన్నప్పటికీ ఆ ప్రయోజనం రైతులకు దక్కడం లేదు. వ్యాపారులు,దళారులు మాత్రం లాభపడుతున్నారు. వివాహాది శుభకార్యాలకు అరటి పండ్లు అవసరం కాబట్టి కార్యాలు చేసే వారు అధిక ధరలు చెల్లించి అరటి పండ్ల గెలలను కొనుగోలు చేస్తున్నారు. రాజాం సంతమార్కెట్‌లో ప్రతీ గురువారం వారపు సంత జరుగుతోంది. ముందటిరోజే కురుపాం, పూసపాటిరేగ, వీరఘట్టం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి అరటిపండ్ల గెలలను రైతులు తీసుకువస్తుంటారు. వీటిని రైతుల నుంచి దళారులు, స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. డజన్ అరటిపండ్ల ధర రూ. 50 నుంచి రూ. 80 పలుకుతోంది.10 నుంచి 12 డజన్లు ఉండే అరటి గెలను రూ. 500 నుంచి రూ.650 వరకు విక్రయిస్తున్నారు. రాజాం పండ్ల మార్కెట్ వద్ద కిలో రూ.30 చొప్పున హోల్‌సేల్ ధరకు అరటిపండ్ల గెలల విక్రయాలు జరుగుతు న్నాయి. వీటితో పాటు కూరకు వినియోగించే కాయ అరటికి కూడా డిమాండ్ బాగానే ఉంది. జత అరటికాయలు గతంలో రూ.14 ఉండేవి. ప్రస్తుతం రూ. 25 నుంచి రూ.30 పలుకుతోంది. కాయ అరటి గెల ధర రూ. 600 నుంచి రూ.800 వరకూ ఉంటోంది. వీటిని కూడా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి చేసుకుంటున్నారు.



రాజాం మండలం సోపేరులో సాగులో ఉన్న అరటి తోట

నాణ్యత ఆదారంగా ధర పెంపు

రాజాంలో అరటిపండ్ల గెలలకు ప్రత్యేకంగా ఒక మార్కెట్ ఉంది. ఇక్కడ రసాయనాలు కలిపి అరటి గెలలను మగ్గబెట్టి విక్రయిస్తుంటారు. వ్యాపా రులు సిండికేట్‌గా మారి ధరలు నిర్ధారిస్తున్నారు. వీరు రైతుల వద్ద గెలను రూ. 200 నుంచి రూ.300లోపు కొనుగోలు చేయడం కష్టమే.కానీ వీరు ప్రజలకు మాత్రం రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. అమృతపాణి, చక్కెర కేళి పండ్ల గెల రూ. 500 దాటి పలుకుతోంది. రాజాంలో రోజుకు సగటున రూ.1.50 లక్షల విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ధర పెరిగింది

మా ఇంట్లో ఒక శుభ కార్యక్రమానికి అరటిపండ్లను కొనుగోలుచేసాం. 20 గెలలు రూ. 12వేల రూపాయలు ఖరీదు చేశాయి. గతంలో కంటే ప్రస్తుతం ధర పెరిగింది.

– జి.రామారావు, బొద్దవలస, రాజాం మండలం.

కాయల గెలలకు కూడా ధర పెరిగింది

గతంలో అరటికాయలకు ధర తక్కువగా ఉండేది. ఒక్కో కాయ రూ. 5కే లభించేది. ఇప్పుడు వీటి ధర పెరిగింది. గెల ధర రూ 700 వరకూ పలుకుతోంది. నాణ్యత ఉంటే రూ. 850 వరకూ వెళుతోంది. గతంలో ఇంత ధర ఎప్పుడూచూడలేదు.

– పి. గౌరీశ్వరి, కూరగాయల వ్యాపారి, మాధవబజార్, రాజాం.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



సోమరాజుపేటలో మట్టినమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రేగిడి: రైతులు తమ పంటపొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ గురుగుబెల్లి మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని ఉంగరాడ, సోమరాజుపేట, తునివాడ, అంబఖండి గ్రామాల్లోని పొలాల్లో ఆదివారం మట్టి నమూనాలు సేకరించారు. వీటిని ల్యాబ్‌లకు పంపించి, భూసార పరీక్షలు చేయిస్తామని ఆయన చెప్పారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఆయా పొలాల్లో ఏ పంటలు సాగు చేసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఆయా గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక

వంగర: షైనింగ్ స్టార్స్ అవార్డుకు మండలంలోని ఏడుగురు విద్యార్థులు ఎంపిక య్యారని ఎంఈఓ ఖండాపు జగదీశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గొట్టాపు కుమారి, బోయిన స్వప్న (కేజీబీవీ వంగర), అడ్డా నవదీప్ (జెడ్పీహెచ్ ఎస్, అరసాడ), సిర్లి జగదీష్‌కుమార్ (జెడ్పీహెచ్ఎస్, వంగర), కొవ్వాడ మాధురి (ఏపీ రెసిడెన్సియల్ స్కూల్, మద్దువలస), దత్తి ప్రశాంతి, పూసర్ల జాహ్నవి (ఆర్ సీఎం స్కూల్, వంగర)లు ఎంపికైన వారిలో ఉన్నారని స్పష్టం చేశారు. వీరందరికీ ఈ నెల 9న విజయనగరంలో నిర్వహించే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

అన్నదాతను దగా చేస్తున్న ప్రభుత్వం



రైతులతో కలిసి మాట్లాడుతున్న సత్యంనాయుడు

రామభద్రపురం: అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి రైతులను దగా చేస్తోందని బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నడిమింటి సత్యంనాయుడు విమర్శించారు. మండలంలోని నాయుడువలసలో రైతులతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారం లోకి రాగానే రైతులకు పంట పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకం పేరిటరూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు గొప్పగా ప్రకటించారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతును పట్టించు కున్న పాపానపోలేదని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని,చిన్న సన్నకారు రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు భరోసాగా సహాయం అందేదని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో రైతులు యర్ర శంకరరావు,కేతిరెడ్డి రామారావు, కోండ్రు పాపయ్య, చింతల ముసలినాయుడు,బొంగు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు రేపు

రాజాం సిటీ: ఈ నెల 10న స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో హుండీల్లో కానుకలను లెక్కించనున్నామని ఆలయ ఈఓ పి.శ్యామలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో హుండీలు తెరిచి, భక్తుల సమక్షంలో ఆదాయం లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

పోతురాజుకు ప్రత్యేక పూజలు

వేపాడ: మండల కేంద్రంలో రజకులు నిర్మించుకున్న నూతన ఆలయంలో పోతురాజు విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. లక్ష్మీగణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో గ్రామ పురోహితుడు గోపాజోస్యుల సాయిరామ్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన, పూజలు చేశారు.

అపరిశుభ్రతకు కేరాఫ్...



మార్కెట్‌లో కుళ్లిన వ్యర్థాల మధ్యే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

- అధ్వానంగా రామభద్రపురం అంతరరాష్ట్ర మార్కెట్
- రోజూ సుమారు రూ.25 లక్షల లావాదేవీలు
- ఏడాదికి రూ.40 లక్షల వరకు పంచాయతీకి ఆదాయం
- ఎక్కడికక్కడే కుప్పలుగా కుళ్లిన కూరగాయలు, పండ్ల వ్యర్థాలు

రామభద్రపురం:

జిల్లాలో అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది.మార్కెట్‌లో ఎక్కడ చూసినా చెత్తా చెదారం,కుళ్లిన కూరగాయలు,పండ్ల వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు,మామిడి పండ్లు విక్రయానికి తెచ్చిన రైతులతో పాటు వాటిని దిగుమతి,ఎగుమతి చేస్తున్న వ్యాపారులు వ్యర్థాలు, చెత్తను ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు.పంచాయతీ కార్మి కులు రెండు, మూడు రోజులకొకసారి చెత్త తొలగిస్తున్నా, మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, రైతులు పరిశుభ్రత పాటించక పోవ డంతో మార్కెట్ ఆవరణ అంతా చెత్తతో దర్శనమిస్తోంది.ప్రస్తుతం మామిడి ధర పూర్తిగా పడిపోయింది. మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన మామిడి పండ్లను రైతులు రోజుల కొద్దీ బస్తాల తో మార్కెట్‌లో ఉంచడంతో అవి కుళ్లి పోతున్నాయి. వాటిని దూరంగా తీసుకువెళ్లి పారబోయక పోవడంతో అక్కడే పేరుకుపోతున్నాయి. దీంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. మార్కెట్‌లో రోజూ కూరగాయలు అమ్ముకునే రైతులు, పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు దుర్వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు.



కుళ్లిన వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్న మార్కెట్

ఏడాదికి రూ.40 లక్షల ఆదాయం..

దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో రోజూ సుమారు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు లావాదేవీలు జరుగుతు న్నాయి.అలాగే రోజూ సుమారు 2 వేల నుంచి 3 వేల మంది రైతులు,చిన్న, పెద్ద వ్యాపారులు సుమారుగా 100 మంది నిత్యం కూరగాయలు క్రయ,విక్రయాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.మార్కెట్ ద్వారా ఆశీల రూపంలో ఏడాదికి పంచాయతీకి రూ.40 లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ పరిశుభ్రత పాటించడంలోనూ, కనీస సౌకర్యలు కల్పించడంలో పంచాయతీ, మార్కెటింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చినుకు పడితే మార్కె ట్ అంతా చిత్తడిగా మారుతోంది. రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశంతో ప్రస్తుత పాలకులు ఇటీవల సుమారు రూ.20 లక్షల పంచాయతీ నిధులతో మార్కెట్‌లో సిమ్మెంట్‌తో ఫ్లోరింగ్ వేశారు. కానీ పరిశుభ్రత విషయంలో అధికారుల పర్యవేక్షణ కరువైందని, రైతులు, వ్యాపారులు అంటున్నారు.



మార్కెట్ మధ్యలో బస్తాలతో కుళ్లిన మామిడి పండ్లను వదిలేసిన దృశ్యం



వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక మార్కెట్‌లోని చిరు వ్యాపారుల దుకాణాల ముందు నిలిచిన మురుగు నీరు

చర్యలు తీసుకుంటాం...

మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడతాం. రోజూ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మార్కెట్ ఆవరణ శుభ్రపరు స్తున్నారు.ఎంత చెప్పినా రైతులు,వ్యాపారులు వ్యర్థాలను మార్కెట్‌లోనే పడేస్తున్నారు.ఇకపై రోజూ పారిశుద్ధ్య పనులు చేయించి, సమస్య లేకుండా చూసుకుంటాం.

– శ్రీనివాసరావు,మేజర్ పంచాయతీ ఈఓ, రామభద్రపురం

ఉపాధ్యాయులను మోసగించడం మంచి పద్ధతి కాదు

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

రామభద్రపురం: బదిలీల విషయంలో ఉపాధ్యాయుల (ఎస్జీటీలు)ను ప్రభుత్వం మోసగించడం మంచి పద్ధతి కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించడం మోసం చేయడమేనని అన్నారు. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించడానికి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి అని ప్రశ్నించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సంఘ నాయకులతో నిర్వహించిన చర్చల్లో స్పష్టమైన హామీలిచ్చి, ఇప్పుడు మాట తప్పడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెబ్ ఆప్షన్స్‌పై టీచర్లలో నమ్మకం పోయిందని, ఇచ్చిన మాట ప్రకారమే ఎస్జీటీల బదిలీలను మాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఉపాధ్యాయులపై మోసపూరిత చర్యలను ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలోనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, సభ్యులు ప్రవీణ్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతున్న ఆ సంఘ నాయకులు

రాజాం సిటీ: జూలై 7వ తేదీన నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగలంతా విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రానా శ్రీనివాస మాదిగ కోరారు. పట్టణ పరిధి మల్లయ్యపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎస్ఎస్ఎఫ్ సంఘాలను ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. జూలై 7వ తేదీన ప్రతీ మాదిగ పల్లెలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేయాలని కోరారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటంచేసి ఎస్సీ వర్గీకరణను సాధించారని చెప్పారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యందవ నారాయణరావు మాదిగ, ఎంఈఎఫ్ అధ్యక్షుడు అరసాడ ఆనందరావు మాస్టారు, విజయనగరం జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి యందవ రవికుమార్ మాదిగ, యందవ ఆనందరావు మాదిగ, తోలేటి మురళి, పోలు, చంటి, అప్పారావు, జాన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన, తదితరులు

బొబ్బిలి: విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఆదివారం పారాస్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టరును ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణతో పాటు కోటలో జరిగిన ఈ చైతన్య యాత్ర కార్యక్రమాల్లో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతురామమూర్తి నాయుడు, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు, చీమల రాంబాబు, పారా స్పోర్ట్స్ సెక్రటరీ రామస్వామి, పారాస్పోర్ట్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దయానంద్, విశాఖ జిల్లా అధ్యక్షురాలు షీతల్, పలువురు విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల ప్రతిష్ఠ



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో నీలమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో నీలమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో గ్రామ దేవత నీలమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు విశేష పూజలు చేశారు.

శ్యాంపురంలో...

రాజాం సిటీ: మండలంలోని శ్యాంపురం గ్రామంలో చిన్నపోలమ్మతల్లి ఆలయాన్ని ఆది వారం ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఒక మంచి అలవాటు



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనం ఒక మంచి అలవాటు అని, ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం చేయడం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం ఏవిధంగా చేయాలో విద్యార్థులకు లైబ్రేరియన్ అవగాహన కల్పించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని చెప్పారు. కథలు, ఇతిహాసాలు, నవలలతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవాలని సూచించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని విద్యార్థులను ఆయన కోరారు.

పర్యావరణ హితం

రాజాం: పర్యావరణ హితం పట్టణంలోని జీఎంఆర్ ఐటీ సమీపంలోని రాజాం మార్టు యజమాని కడగల నాగరాజు ఆదివారం పలువురికి ఉచితంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి అంతా ముందుకు రావాలని కోరారు.జీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.ఎస్.వి.ప్రసాద్, రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె. నాయుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, పీడీ అరుణ్‌కుమార్, కిరణ్ కుమార్, డోల వాసుదేవరావు, పొలవలస రాజగోపాలరావు, రెడ్డి శ్రీనివాసరావు, రఘునాథ్, ఎం.సురేష్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న నాగరాజు, తదితరులు

నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు

బాడంగి: ముగడ గ్రామంలోని హరిజన వీధిలో ఉన్న బాలయేసు దేవాలయం(చర్చి) సిల్వర్‌జూబ్లీ వేడుకలను సోమవారం నిర్వహిచనుట్టు సంఘ పెద్దలు,ఇన్‌ఫ్రంట్ జీసస్ యూత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫాదర్ సీహెచ్.సురేష్, ఉపదేసీ చిన్నారావు ఆధ్వర్యంలో ఆలయంలో బాలయేసు స్వరూపాన్ని ప్రతిష్ఠించనున్నట్లు స్పష్టం చేశారు.